



రండి... ఓటేద్దాం!

విజ్ఞతతో ఆలోచించి.. మంచి నేతను ఎన్నుకుందాం

(పార్వతీపురం- ఆంధ్రజ్యోతి)

ఓటు.. వజ్రాయుధం
రాజ్యాంగం కల్పించిన హక్కు
వ్యవస్థల మార్పునకు పునాది
మన తలరాత మార్చే అస్త్రం.
నిజాయితీ నేతలను ఎన్నుకుందాం.

ఐదేళ్లకోసారి వచ్చే ఓట్ల పండగకు రంగం సిద్ధమైంది. 'మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి. దేవుడు మీద కానీ, మహానుభావులపై కానీ ఆధారపడొద్దు' అన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాటలు వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన రోజు వచ్చింది. ప్రజలు మెచ్చిన నేతను ఎన్నుకునే సమయం ఆసన్నమైంది.

-రండి.. అందరూ తరలిరండి. ఓటుహక్కు వినియోగించుకుందాం.

ప్రలోభాలకు లొంగకుండా.. నిజాయితీగా నిబద్ధతతో వ్యవహరించి.. విజ్ఞతతో ఆలోచించి సచ్ఛీలురైన పాలకులను ఎన్నుకుందాం. పాలనలో అనుభవం, నిబద్ధత నాయకులకు అవకాశం ఇద్దాం. సంక్షేమం, అభివృద్ధి కలగలిపి చేసే నేతలను గద్దెనెక్కిద్దాం. విధ్వంసకర పాలనతో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన వారిని ఇంటికి పంపిద్దాం. వ్యవస్థలను ధ్వంసం చేసిన వారికి బుద్ధి చెబుదాం. మన యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల్లేకుండా చేసిన వారిని సాగనంపుదాం. ఈ సువర్ణావకాశాన్ని కచ్చితంగా సద్వినియోగం చేసుకుందాం. ఓటు అనే వజ్రాయుధంతో వ్యవస్థలో మార్పునకు నాంది పలుకుదాం. అవినీతి పరులను ఇంటికి పంపి.. మంచినేతలను చట్టసభలకు పంపిద్దాం. అవినీతిని నిర్మూలించి సుపరిపాలనకు శ్రీకారం చుడదాం.

-రండి.. ఓటరులారా..
తరలిరండి.. ఓటేద్దాం.

బరిలో ఉన్నది వీరే..

- నాలుగు అసెంబ్లీ, అరకు పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు
- పోటీలో ప్రధాన పార్టీ అభ్యర్థులు

పార్వతీపురం, మే12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు సార్వత్రిక పోరులో నిలిచారు. అంతటా 'నువ్వా-నేనా' అన్న విధంగా పోటీ ఉంది. అయితే కూటమి అభ్యర్థులకు అత్యధిక శాతం ప్రజల నుంచి మద్దతు లభిస్తోంది. టీడీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థిగా తోయక జగదీశ్వరి, వైసీపీ నుంచి పాముల పుష్పశ్రీవాణి, సీపీఎం అభ్యర్థి మండంగి రమణ పోటీలో ఉన్నారు. పార్వతీపురం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా బోనెల విజయచంద్ర, వైసీపీ నుంచి అలజంగి జోగారావు, కాంగ్రెస్ నుంచి బి.మోహన్‌రావు బరిలో ఉన్నారు. పాలకొండ నియోజకవర్గం నుంచి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా నిమ్మక జయకృష్ణ, వైసీపీ అభ్యర్థిగా విశ్వసరాయి కళావతి, కాంగ్రెస్ పార్టీ తరఫున సవర చంటిబాబు పోటీలో ఉన్నారు. సాలూరు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి, వైసీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర, కాంగ్రెస్ నుంచి ఎం.పుష్పారావు పోటీలో ఉన్నారు. అరకు పార్లమెంట్ పరిధిలో ఎన్డీఏ అభ్యర్థిగా బీజేపీ నుంచి కొత్తపల్లి గీత, వైసీపీ అభ్యర్థి తనూజారాణి తలపడుతున్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా యంత్రాంగం
- ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది
- నేటి ఉదయం 7 గంటల నుంచి ఓటింగ్
- పోలీసు, కేంద్ర బలగాలతో పటిష్ఠ బందోబస్తు



పార్వతీపురంలో ఎన్నికల సిబ్బంది ఇలా..

పార్వతీపురం, మే12 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక పోరు తుది దశకు చేరుకుంది. మరికొద్ది గంటల్లో పోలింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం జరగనున్న పోలింగ్‌కు సంబంధించి సామగ్రి తరలింపు పూర్తయింది. పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది ఆదివారం ఉదయమే జిల్లాలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరుకుని ఎన్నికల సామగ్రిని తీసుకున్నారు. పోలింగ్ సమయాల్లో చేపట్టాల్సి విధివిధానాల గురించి వారికి అధికారులు వివరించారు. సెక్టార్ల వారీగా పోలింగ్ కేంద్రాల విధులు అప్పగించారు. దీంతో ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, ఇతర సామగ్రితో వారికి కేటాయించిన కేంద్రాలకు పయనమయ్యారు.

సెక్టార్ల వారీగా..

పార్వతీపురంలో 33 సెక్టార్లు, పాలకొండలో 35 , కురుపాంలో 44, సాలూరులో 32 సెక్టార్లు ఏర్పాటు చేశారు. పార్వతీపురం, పాలకొండ, కురుపాంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, సాలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా ఆయా కేంద్రాల నుంచి ఈవీఎంల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 6.30 గంటలకు ఎన్నికల పరిశీలకుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లను తెరిచి ఈవీఎంల పంపిణీ ప్రారంభించారు. ఎన్నికల సిబ్బందికి సెక్టార్, రూట్ వారీగా బస్సులు ఏర్పాటు చేసి బందోబస్తుతో పోలింగ్ కేంద్రాలకు పంపించారు. జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియను కలెక్టర్ నిశాంత్‌కుమార్ పర్యవేక్షించారు. జేసీ శోభిక, సాలూరు, పాలకొండ, పార్వతీపురం, కురుపాం ఆర్వోలు విష్ణుచరణ్, శుభం బన్సల్, కె.హేమలత, వీవీ రమణ తమ నియోజకవర్గాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

మాక్ పోలింగ్‌తో ప్రారంభం

పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం ఏజెంట్ల సమక్షంలో నమూనా ఓటింగ్ (మాక్ పోలింగ్) నిర్వహించి ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. పార్వతీపురంలో సాయంత్రం ఆరు గంటల వరకు, సాలూరు, కురుపాం, పాలకొండలో సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే పోలింగ్ నిర్వహించనున్నారు. కాగా ఎన్నికల సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్న భోజన ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సైతం ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. సిబ్బందికి ఆహారం, వసతి సౌకర్యాలతో సహా అన్ని ఏర్పాట్లు చేశారు.

జిల్లాలో తొలిసారిగా..

పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. జిల్లాలో మొత్తంగా 1,031 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 219గా గుర్తించారు. ఏపీ-ఒడిశా వివాదస్పద గ్రామాలైన కొఠియా గ్రూప్‌లో ప్రత్యేకంగా మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పార్వతీపురంలో 443, సాలూరులో 148, పాలకొండలో 142, కురుపాంలో 132 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా ఓటింగ్ జరగనుంది. జిల్లాలో మూడు మూడు ఆర్టీసీ డిపోల నుంచి 280 బస్సులను ఎన్నికల నిర్వహణకు కేటాయించారు.

ఓటర్లు ఇలా..

'మన్యం'లో 7,83,440 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో పురుషులు 3,82,589 మంది, మహిళలు 4,00,779 మంది, థర్డ్‌జెండర్లు 72 మంది ఉన్నారు. కురుపాం నియోజకవర్గంలో 1,94,114 మంది, పార్వతీపురంలో 1,89,817 మంది, సాలూరులో 2,04,489మంది ఓటర్లు ఉన్నారు. అయితే సాలూరు నియోజకవర్గంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలు పార్వతీపురం మన్యంలో, మెంటాడ మండలం విజయనగరం జిల్లాలో ఉంది. దీంతో భద్రత ఏర్పాట్లను ఇరు జిల్లాల పోలీసుల అధికారులు చూస్తున్నారు. ఇదిలా ఉండగా 'మన్యం'లో మొత్తంగా 6,600 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నారు. 1,150 మంది పోలీసులు, ఆరు కంపెనీల కేంద్ర బలగాలు కూడా ఎన్నికల నిర్వహణలో భాగస్వాములయ్యారు.

అమలులో 144 సెక్షన్

సాలూరు: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీ ఏర్పాట్లను ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. అనంతరం భద్రత ఏర్పాట్లపై సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.



సాలూరు: పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



పాలకొండలో..

రిసెప్షన్, లెక్కింపు కేంద్రాల పరిశీలన



ఏర్పాట్లపై సిబ్బందితో చర్చిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం, మే12 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలం ఉల్లిభద్ర ఉద్యాన కళాశాలలో పోలింగ్ సామగ్రి స్వీకరణ, లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఆదివారం ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్‌కుమార్, కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలించారు. పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం నాలుగు నియోజకవర్గాలకు వేర్వేరుగా కేటాయించిన శిబిరాల్లో కౌంటర్ల వద్ద టేబుళ్లు, కుర్చీల ఏర్పాటు, పోలింగ్ అనంతరం పీవోలు, ఏపీవోల ప్రైవసీ, తదితర వసతుల అంశాలపై ఆరా తీశారు. లెక్కింపు కేంద్రాల వద్ద బారికేడ్లు, గోడలకు మెస్ ఏర్పాటును నిశితంగా పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి ఆహారం అందించేందుకు ఏర్పాటు చేసిన ఫుడ్‌కోర్టు శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. టాయిలెట్స్ నిర్మాణాలు, ఈవీఎంల భద్రత, లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, వెబ్‌కాస్టింగ్ తదితర వాటిని పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద రాకపోకలను అంతరాయం కలగకుండా కళాశాల ముందు భాగంలో బస్సుల పార్కింగ్‌కు స్థలాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. బస్సులు నడిపేందుకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రిసెప్షన్ కేంద్రానికి వచ్చి, వెళ్లే మార్గాలను సూచించారు. ఈ పరిశీలనలో జేసీ శోభిక, కంట్రోల్ రూమ్ ఎస్‌డీఈ ఆర్.సూర్యనారాయణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీపీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటుకు రూ.వెయ్యి

- జిల్లా వ్యాప్తంగా కొనసాగిన వైసీపీ ప్రలోభాల పర్వం
- అధికార పార్టీ సేవలో మాజీ వలంటీర్లు



పార్వతీపురం, మే12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో వైసీపీ ప్రలోభాల పర్వం ఆదివారం కూడా కొనసాగింది. పలు ప్రాంతాల్లో ఓటర్లకు నగదుతో పాటు మద్యం, సారాతో వల వేశారు. పట్టణాలు, పల్లెల్లో వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు ఈ తతంగం నడుపుతున్నారు. ప్రత్యేక ప్యాకేజీ నిధుల నుంచి ఆదివారం ప్రతి ఓటుకు రూ.వెయ్యి అందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి రానుపోను చార్జీలు అందజేసి.. తమ పార్టీకే ఓటు వేయాలని అభ్యర్థించారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఓటర్ల సంఖ్యను బట్టి ముందుగానే కొంతమంది వైసీపీ ద్వితీయ శ్రేణి నేతలకు నగదును అందించారు. ఈ మేరకు వారు స్థానిక నాయకులు, కొంతమంది మాజీ వలంటీర్లతో కలిసి నగదు పంపిణీ చేపట్టారు. కొన్నిచోట్ల ఉదయం ఐదు గంటల నుంచే ఈ కార్యక్రమం చేపట్టారు. కొందరు మాజీ వలంటీర్లే అధికార పార్టీకి పంపిణీ ఏజెంట్లుగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. మరోవైపు జిల్లా కేంద్రం పార్వతీపురంతో పాటు 15 మండలాల్లో సారా ఏరులై పారింది. శనివారం సాయంత్రం నుంచే కొంతమంది వైసీపీ నేతలు సారా పంపిణీ చేపట్టారు. ముందస్తుగానే వ్యాపారులకు అడ్వాన్స్ రూపంలో కొంతమొత్తం ఇచ్చి సారాను వారు తెప్పించుకున్నారు. దానిని ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేశారు.

కరెంట్ పోతే.. కారు చీకటి



చీకట్లో సీతంపేటలో పోలింగ్ కేంద్రం

సీతంపేట: సీతంపేట మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో కారు చీకటి నెలకొంది. చిన్నపాటి చార్జింగ్ లైట్ ఏర్పాటు చేసినప్పటికీ పోలింగ్ కేంద్ర పరిసరాలు చీకటి వాతావరణం ఏర్పడింది. అయితే పది నిమిషాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించడంతో సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. సోమవారం జరిగే ఓటింగ్ కోసం ఆదివారం సాయంత్రమే మండలంలో కొన్ని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలివచ్చారు. అయితే ఈదురుగాలులకు ఒక్కసారిగా సీతంపేట పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పలేదు. వాస్తవానికి పోలింగ్ కేంద్రాలకు జనరేటర్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. చిన్నపాటి చార్జింగ్ లైట్ సౌకర్యం కల్పించడంతో ఏ క్షణాన కరెంట్ పోతుందోనని పోలింగ్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. అసలే ఏజెన్సీ ప్రాంతం కాగా.. చిన్నపాటి వర్షానికి కూడా తరచూ కరెంట్ పోనుంది. దీంతో పలు పోలింగ్ కేంద్రాలు కారు చీకట్లో మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది.

భోజనాల కోసం ఎదురుచూపు

- పోలింగ్ సిబ్బందికి తప్పని అవస్థలు
- ఏర్పాట్లలో సంబంధిత అధికారులు విఫలం



సాలూరులో భోజనాల ప్యాకెట్లు సక్రమంగా పంపిణీ చేయకపోవడంపై నిర్వాహకులను ప్రశ్నిస్తున్న ఆర్వో విష్ణుచరణ్



పార్వతీపురంలో భోజనం కోసం ఎదురు చూస్తున్న ఎన్నికల సిబ్బంది

పార్వతీపురం టౌన్/సాలూరు, మే 12 : పార్వతీపురంలో ఎన్నికల సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం భోజనాల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. నియోజకవర్గ పరిధిలో ఉన్న వివిధ పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సిన ఎన్నికల సిబ్బంది ఉదయం 9 గంటలకే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే వారికి అల్పాహారానికి సంబంధించి అధికారులు మమా అనిపించేశారు. కాగా మధ్యాహ్నం 12 గంటల నుంచి మాత్రం పోలింగ్ సిబ్బందికి భోజనాలు అందించడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన పోలీసులు, సేవా సిబ్బందికి మధ్యాహ్నం 2 గంటల వరకు భోజనం అందించపోవడంతో పలువురు బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను వివరణ కోరగా అందుబాటులో రాలేదు. సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కూడా ఎన్నికల సిబ్బందికి సక్రమంగా భోజన ప్యాకెట్లు అందలేదు. దీంతో పలువురు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంబంధిత అధికారుల తీరుపై మండిపడ్డారు.

ఓటర్లకు ప్రయాణ కష్టాలు

పార్వతీపురం టౌన్, మే 12 : తమ ఓటు హక్కును వినియోగించేందుకు చేరుకున్న ప్రయాణికులతో జిల్లాలో బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. అయితే ఎప్పటిలానే వారికి ప్రయాణ కష్టాలు తప్ప లేదు. ఆదివారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రజలు పడిగాపులు కాయాల్సి వచ్చింది. బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. పూర్తిస్థాయిలో బస్సులు లేక పోవడంతో నానా అవస్థలు పడుతూ.. వారంతా తమ స్వగ్రామాలకు చేరు కున్నారు. కొందరు బస్సుల్లో సీట్ల కోసం పోటీపడ్డారు. మరి కొందరు ఫుట్‌పాత్‌పై నిల్చొని గమ్య స్థానాలకు చేరుకోవాల్సి వచ్చింది. పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అధిక శాతం బస్సులను ఎన్నికల నిర్వహణకు కేటాయించడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. ముఖ్యంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు, వలస ఓటర్లు పిల్లాపాపలు, కుటుంబ సభ్యులతో తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. ఈ విషయమై ఆర్టీసీ డిపో మేనేజర్ దుర్గను వివరణ కోరగా అవకాశం ఉన్నంత వరకు బస్సులను ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు.



పార్వతీపురంలో బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

పెద్దల మాట

నేడు స్వార్థ రాజకీయాలే అధికం

(శృంగవరపుకోట రూరల్)



నేటి రాజకీయాలు స్వార్థంతో నిండిపోయాయి. నాటి రాజకీయాలు నేడు మచ్చుకైనా కనిపించడం లేదు. నాడు మమ్మల్ని ఓట్లు అడిగే సమయంలో వారు ఏ హామీ ఇచ్చినా కచ్చితంగా నేరవేర్చడంతో పాటు కించిత్తు అహంభావం, గర్వం వంటివి లేకుండా అందరినీ సమానంగా చూసేవారు. నేను 1923లో పుట్టాను. ఐదో తరగతి వరకు చదువుకున్నాను. అప్పుడు స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నా. మొదటి ఓటు ఒక రేకుడబ్బాలో వేసినట్లు గుర్తు. రంగుల కాగితం ఇచ్చి ప్రతి అభ్యర్థికి కేటాయించిన రంగుడబ్బాలు ఉంచేవారు. మాకు ఏ అభ్యర్థి నచ్చితే.. ఆరంగు కాగితం తీసుకొని ఆ డబ్బాలో వేసేవారం. ఈ ఎన్నికల్లో యువత తమకు మేలు చేసిన వారిని ఎన్నుకోవాలి.

-సేనాపతి కోటరావునాయుడు (101), శతాధికవృద్ధుడు, కొట్టాం

సంక్షేమ పాలకుడు ఎన్టీఆరే

(బొబ్బిలి)



సంక్షేమ పాలకుడు అంటే ఎన్టీఆర్ పేరు గుర్తుకొస్తుంది. ఆయన సీఎం అయ్యాక కిలో రెండు రూపాయలకు బియ్యం ఇచ్చాడంటే అది ఆషామాషీ ఏమీ కాదు. ఆనాడు బియ్యం వండుకొని మూడు పూటలా తినడం పేదలు ఎరుగరు. మహానుభావుడు ఎన్టీఆర్ బియ్యం ఇచ్చిన తరువాత అన్నం వండుకొని తినే కుటుంబాలు బాగా పెరిగాయి. చంద్రబాబు పెట్టిన అన్న క్యాంటీన్ కూడా అలాంటిదే. బ్రిటీషు కాలం నుంచి బొబ్బిలి ప్రాంతంలో షుగర్ ఫ్యాక్టరీలంటే ఎంతో పేరు.. విలువ ఉండేది. చెరకు రైతులు బాగుపడాలంటే ఫ్యాక్టరీని మూసివేయకుండా పక్కాగా నడపాల్సిందే. అందరికీ అన్ని రకాలుగా ఉపాధి కలుగుతుంది. మిగిలిన ఫ్యాక్టరీలన్నిటినీ మంచిగా నడిపించాలి. రాజకీయాలను పక్కన పెట్టి.. అందరూ బాగుండాలన్న తపన నాయకుల్లో పెరగాలి.

- నడిగట్ల రాము(73), పాత బొబ్బిలి

ఎన్నికలు వస్తే కోలాహలమే

(మక్కువ)



అప్పటి రోజుల్లో ఎన్నికలు వస్తే గ్రామాల్లో కోలాహలంగా ఉండేది. పోటీ చేసే అభ్యరుల చిత్రాలను తోపుడుబళ్లపై అంటించి మైక్‌లతో ప్రచారం నిర్వహించేవారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభ్యర్థులను గుర్తించి చదివి వినిపించి ప్రతి ఊరులోనూ అన్ని వీధుల్లో కలియదిరిగేవారు. ఎన్నికల ప్రచారంలో తాగేందుకు టీ, సోడాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. అభ్యర్థులు ఎక్కువగా రచ్చబండల వద్ద సమావేశాలు నిర్వహించి తమకు ఓటు వేసి గెలిపించాలని కోరేవారు. ఎన్నికల అనంతరం గెలిచిన, ఓడిన అభ్యర్థులు ఇద్దరూ ప్రజలకు అందుబాటులో ఉండేవారు. సమస్యలపై స్పందించేవారు. అప్పట్లో రాజకీయ కక్షలు, విభేదాలు చాలా తక్కువ. నేటి రాజకీయాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి.

- బూరాడ ఎర్ర అప్పన్న, మక్కువ మండలం

ఓటు వేయడానికి ఆనందంగా ఉండేది

(సాలూరు రూరల్)



ఓటు వేయడానికి అప్పట్లో ఆనందంగా ఉండేది. ఎన్నికలు అంటే సందడిగా సాగేవి. ఇప్పుడు పోటీ పడినోళ్లు బోలెడు చెబుతారు. వారి చెప్పినవి వింటాం. గతంలో ఓటు వేయడానికి ఎటువంటి ప్రలోభాలు పెట్టేవారు కాదు. ఇప్పుడు రోజులు మారాయి. ఓటు వేయాలని డబ్బు ఖర్చు పెడుతున్నారు. ఇలాంటి పద్ధతిని ఈతరం వారు దూరం పెట్టాలి. ఓటును నచ్చినోళ్లకు నిజాయితీగా వేయాలి. అప్పుడు పార్టీ కంటే పోటీ పడేవారి గురించి తెలుసుకొనే వాళ్లం. ఇప్పుడు పార్టీ ప్రభావం అధికంగా కనిపిస్తోంది. మనకు మేలు చేసిన వారికే ఓటు వేయాలి.

- ఎ.దాలమ్మ (76), కొత్తవలస, సాలూరు మండలం

ఓటు వేయాలంటే ఎన్ని కష్టాలో..



మారుమూల గ్రామమైన లొద్దకు కాలి నడకన వెళుతున్న గిరిజన మహిళలు

- మన్యం వాసులకు రవాణా సమస్యలు
- దశాబ్దాలుగా పరిష్కారం కాని వైనం

(కొమరాడ)

మన్యం వాసులు ఓటు వేయడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సరైన రవాణా సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అనేక గ్రామాల ప్రజలు నేటికీ ఓటెయ్యాలంటే కిలోమీటర్ల దూరం నడక సాగించాల్సిన పరిస్థితి ఉంది. భద్రతా కారణాల దృష్ట్యా మారుమూల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మారుస్తుండడంతో ఆ గ్రామాల ప్రజలు కొండలు, గుట్టలు ఎక్కుతూ కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఓటెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడింది. మన్యం ప్రాంతంలో నేటికీ కనీసం ద్విచక్ర వాహనం వెళ్లలేని గ్రామాలు అనేకం ఉన్నాయి. కొమరాడ మండలం నయా పంచాయతీ మారుమూల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతూ నయాలోని పోలింగ్ కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ పంచాయతీ పరిధిలో 9 గ్రామాలు ఉన్నాయి. పోలింగ్ కేంద్రానికి 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న లొద్ద, వాటకోసు, దేరుపాడు, వనకాబడి, తదితర గ్రామాల నుంచి ఓటర్లు నయాలో ఉన్న పోలింగ్ కేంద్రానికి చేరుకోవలసిన పరిస్థితి ఉంది. ఈ పోలింగ్ కేంద్రంలో 774 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

చోళ్లపదం పంచాయతీ రెబ్బ, వనాధార గ్రామాల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు నాగావళి నది దాటి చోళ్లపదంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి చేరుకోవలసి ఉంటుంది. ఇలా జిల్లా వ్యాప్తంగా అనేక గిరిజన గ్రామాల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే కిలోమీటర్ల కొలదీ కాలినడకన వెళ్లవలసిన పరిస్థితి ఉంది. ఈ కారణంగానే గిరిజన గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఓటింగ్ శాతం తక్కువగా నమోదవుతోంది.

పాలకుల హామీలు నీటి మూటలే

గ్రామాలకు రహదారులు నిర్మిస్తామని ఎన్నికల హామీలు గుప్పిస్తున్న నాయకులు అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేటికీ కనీసం ద్విచక్ర వాహనాలు సైతం చేరుకోలేని గ్రామాలు అనేకం ఉండటం బాధాకరం. అత్యవసర పరిస్థితుల్లో రోగులు, గర్భిణులను డోలీ మోతతో ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కొఠియా ఓటర్ల పరిస్థితి ఏంటో!

- అటో ఇటో ఒకవైపే వేయాలంటున్న అధికారులు

సాలూరు రూరల్, మే 12: కొఠియా గ్రూప్ ఓటర్లు సాధారణంగా ఇరు రాష్ట్రాలలో ఓట్లు వేస్తారు. గతంలో వేర్వేరు తేదీల్లో ఎన్నికలు జరిగినప్పుడు ఇదే విధంగా ఇరు రాష్ట్రాలలో ఓట్లు వేసేవారు. ఒడిశాలో కొరాపుట్ లోక్‌సభ, పొట్టంగి అసెంబ్లీ, ఏపీలో అరకు లోక్‌సభ, సాలూరు అసెంబ్లీకి ఈ నెల 13న ఏకకాలంలో పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఏక కాలంలో ఒక వ్యక్తి ఇరు చోట్ల ఓట్లు వేయకూడదు. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల అధికారులు తర్జన భర్జన పడ్డారు. రెండు రాష్ట్రాల్లో ఒకే రోజు ఎన్నికలు కావడంతో ఏ రాష్ట్రానికి అధికంగా వారి మద్దతు ఉంటుందోనని ఉత్కంఠ నెలకొంది. తమ రాష్ట్రానికి అధికంగా ఓటింగ్ జరిగే విధంగా ఒడిశా సకల ప్రయత్నాలు చేస్తోంది. ఏపీ ప్రభుత్వం కొఠియా వాసుల కోసం నేరేళ్లవలస, శిఖపరువు, కురుకూటిల్లో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసింది. ఏపీ పోలింగ్ కేంద్రాలకు కొఠియావాసులు రావాలంటే గరిష్టంగా 22 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. ఏపీ ఓటర్ల జాబితా ప్రకారం 2,554 మంది ఓటర్లు ఉన్నారు. ఒడిశా మాత్రం వారి గ్రామాలకు సమీపంగానే కొఠియా, పగులుచెన్నారు, ముడకారు, గంజాయిభద్ర, రణసింగి, గాలిగబడారు, తావుపొదర్, గెమ్మెల పొదర్, తురియాలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసింది. ఒడిశా జాబితా ప్రకారం 5,502 మంది ఓటర్లు ఉన్నారు. కొఠియావాసులు స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. వారు తమకు ఇష్టమైన చోట ఒక ఓటును వేసుకోవచ్చునని సాలూరు ఆర్వో విష్ణు చరణ్ అభిప్రాయపడ్డారు. మరి వారు ఎటువైపు మొగ్గు చూపుతారో చూడాలి.



వాహనంపై ఇలా..(ఫైల్)



నడిచివస్తున్న కొఠియా వాసులు (ఫైల్)

ఓటు ఎక్కడ ఉందో!

భామిని: ఆదివాసీల్లో అనేక మంది తమ ఓటు ఎక్కడ ఉందో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఒక పోలింగ్ బూత్ పరిధిలోని వారికి మరో బూత్‌లో ఓటు ఉండడం... అనేక గ్రామాల్లో స్లిప్పులు అందకపోవడంతో ఆదివాసీలు గందరగోళానికి గురవుతున్నారు. మణిగ, బొడ్డగూడ పోలింగ్ కేంద్రాల్లో పలువురి ఓట్లు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి ఉంది. పల్లపు ప్రాంతాల్లో బీఎల్‌వోలు, సిబ్బంది ఓటరు స్లిప్పులు ఇచ్చారు. కొండ ప్రాంతంలో మాత్రం ఓటరు స్లిప్పులు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

నా ఓటు బత్తిలిలో..



నా ఓటు 2019 నుంచి బత్తిలిలో కొనసాగుతోంది. ఓటరు జాబితాలో తప్పులు ఉన్నాయని... సరిచేయాలని అనేకసార్లు అధికారులకు చెప్పినా మార్పు లేదు. బొడ్డగూడ పంచాయతీ పరిధిలోని బంఢ్రసింగిలో ఉంటున్నాను. బొడ్డగూడలోనో లేదా భామినిలోనో నాకు ఓటు ఉండాలి. కానీ బత్తిలిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఓటు వేయడం మన హక్కు. కాబట్టి తప్పని పరిస్థితిలో ఓటు వేయడానికి వెళుతున్నా.

- ఆరిక నాగేశ్వరరావు, రైతు, బంఢ్రసింగి



ఓటరు జాబితాలో తమ ఓటును చూసుకుంటున్న దృశ్యం

కొండ శిఖరాన పోలింగ్ కేంద్రం

- ఓటు వేయడానికి ఇక్కట్లు

భామిని: తివ్వకొండ శిఖరాన మణిగలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల పల్లపు ప్రాంతంలో ఉన్న మూలగూడ, యాతంగూడ గిరిజన ప్రాంతాల నుంచి ఏడు కిలోమీటర్లు నడిచి కొండ ఎక్కి ఓటు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. మణిగ పోలింగ్ కేంద్రంలో నెట్‌వర్క్ సౌకర్యం లేనప్పటికీ ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్ మేరకు అక్కడ ఏర్పాటు చేశారు. 505 మంది ఓటు వేసేందుకు ఈ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బొడ్డగూడ పోలింగ్ కేంద్రానికి కొండ శిఖరాన ఉన్న కోటకొండ, బంఢ్రసింగి, కడంబసింగి, కోసిమానుగూడ తదితర గ్రామాల నుంచి సుమారు ఐదు కిలోమీటర్లు కాలి నడకన వెళ్లాల్సి వస్తోంది. సతివాడ పోలింగ్ కేంద్రానికి పాలీస్‌కోట, పోలవరం, కొత్తగూడ గ్రామాల ఓటర్లు వెళ్లాల్సి ఉంది. ఈ మూడు కేంద్రాల్లో ఓటు వేసేందుకు ఆదివాసీ గిరిజనులకు తిప్పలు తప్పడం లేదు.



కొండ శిఖరాన ఉన్న మణిగ పోలింగ్ కేంద్రం

పోలింగ్ కేంద్రానికి ఎలా వెళ్లాలో తెలియడం లేదా?

- నా ఓటు యాప్‌ను వినియోగించుకోండి
- అరచేతిలో ఎన్నికల సమగ్ర సమాచారం

(విజయనగరం)

ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు... ఓటర్ల సౌకర్యార్థం 'నా ఓటు' అనే నూతన యాప్‌ను ఎన్నికల సంఘం తీసుకువచ్చింది. ఎన్నికల సమగ్ర సమాచారాన్ని తెలుసుకునే విధంగా దీన్ని రూపొందించింది. దీని కోసం చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే సరిపోతుంది. సోమవారం జరిగే పోలింగ్‌లో ఓటు హక్కును సులువుగా వినియోగించుకునేందుకు ఈ యాప్ దోహదపడుతుంది. ఇందులో వివిధ అంశాలు పొందుపరిచారు. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని సేవలు పొందవచ్చు. ఓటర్లకు సంబంధించిన సమగ్ర సమాచారం ఈ యాప్‌లో ఉంది. ఓటరు సెర్చ్ ద్వారా వివరాలను తెలుసుకోవచ్చు. పేరు, తండ్రి పేరు, వయస్సు, లింగం, జిల్లా, నియోజకవర్గం నమోదు చేస్తే అన్ని వివరాలు తెరపై కనిపిస్తాయి. ఎలక్ట్రానిక్ ఫొటో ఐడెంటిటీ కార్డు (ఎపిక్ సంఖ్య)తో సహా కేంద్రాల వివరాలు వస్తాయి. ఒక వేళ ఇవన్నీ కాకుండా ఎపిక్ సంఖ్య నమోదు చేసినా ఓటరు వివరాలు పూర్తిగా తెలుస్తాయి.

దివ్యాంగుల కోసం..

దివ్యాంగుల కోసం నా ఓటు యాప్‌లో పికప్ సర్వీసు యాప్ ఉంటుంది. వారు తమ ఎపిక్ సంఖ్యను నమోదు చేస్తే బీఎల్‌వోకు పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలనే సమాచారం వెళ్తుంది. దివ్యాంగుల ఫోన్ నెంబర్లు అనుసంధానమై ఉండాలి. అలా లేకపోయినా సంబంధిత బీఎల్‌వోకు ఫోన్ చేస్తే వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తారు.

ప్రభుత్వం పంపిణీ చేసే ప్రతి ఓటరు స్లిప్‌పై సంబంధిత బీఎల్‌వో నెంబరు ఉంటుంది. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసినా లోకేషన్ వస్తుంది.

అభ్యర్థుల వివరాలు కూడా...

నియోజకవర్గంలో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల సమాచారంతో పాటు వారి పార్టీ పేరు నా ఓటు యాప్‌లో కనిపించనున్నాయి. ఇందులో జిల్లా ఎన్నికల అధికారి, నియోజవర్గాల రిటర్నింగ్ అధికారుల పేర్లు, ఫోన్ నెంబర్లతో పాటు ఈ మెయిల్ వివరాలను సైతం పొందుపరుస్తారు.

పోలింగ్ కేంద్రానికి మార్గం..

నా ఓటు యాప్‌లో పోలింగ్ కేంద్రానికి ఎలా చేరుకోవాలో తెలిపే ఆప్షన్ ఉంది. ఇందులో ఓటర్లు తాము ఉన్న ప్రాంతం నుంచి నిర్దేశిత పోలింగ్ కేంద్రానికి చేరుకోవడానికి రూట్ మ్యాప్ ఉంటుంది. దీని కోసం జీపీఎస్ ఆప్షన్ ఉన్న ఫోన్‌ను వినియోగించాల్సి ఉంటుంది. యాప్‌లో పోలింగ్ స్టేషన్, సమీపంలో ఉండే బస్టాండ్ వివరాలు తెలుసుకోవచ్చు.

ఎన్నికల విధుల్లో.. ఎన్‌సీసీ కేడెట్లు

(విజయనగరం)

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధులకు ఓపీవోలు, ఎన్‌సీసీ కేడెట్లను ఎన్నికల కమిషన్ నియమించింది. కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అదర్ పోలింగ్ ఆఫీసర్లుగా (ఓపీవో) నియమించేందుకు ఈసీ అనుమతించింది. వీరితో పాటు ఎన్‌సీసీ కేడెట్లు ఎన్నికల విధుల్లో పాల్గొనేలా అవకాశం కల్పించారు. ఓపీవోలు పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు సిరా గుర్తు పెట్టడం వంటి పనులకు సహకరిస్తారు. కేడెట్లు ఓటర్లను క్యూలైన్లో ఉంచేలా చర్యలు తీసుకోవడం... వృద్ధులకు పోలింగ్ కేంద్రం లోపలికి తీసుకువెళ్లడం వంటి విధులు నిర్వహించనున్నారు. వీరంతా ఆదివారం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

బిర్యానీ రెడీ!

- ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి వైసీపీ నాయకుల ఎర

(విజయనగరం)



పోలింగ్‌కు మరికొద్ది గంటలు మాత్రమే మిగిలి ఉంది. దీంతో ఓటర్లను ప్రసన్నం చేసుకు నేందుకు అభ్యర్థులు పాట్లు పడుతున్నారు. మద్యం, బిర్యానీ పంపిణీ చేసి ప్రసన్నం చేసుకోవడానికి తంటాలు పడుతున్నారు. అనేక గ్రామాల్లో ఇంటింటికి డబ్బులు, అవసరమైన చోట మద్యం పంపిణీ పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. కొన్నిచోట్ల అధికార పార్టీకి చెందిన నాయకులు హోటళ్లలో ముందే ఆర్డర్ చేసి... టోకెన్ ఇచ్చిన వారికి మాత్రమే బిర్యానీ, భోజనాలు అందించాలని ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. సర్వేలు టీడీపీ కూటమికి అనుకూలంగా ఉండడంతో వైసీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఓటర్లను తమ వైపునకు తిప్పుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు.

కొంతమందికే పంపిణీ

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు కొంతమంది నాయకులను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా డబ్బులు పంపిణీ చేస్తున్నారు. తమ ప్రాంతంలో ఇంతమంది ఓటర్లు ఉన్నారు... ఇంత మొత్తం అవుతుందని చోటా నాయకులు అభ్యర్థులకు తెలియజేస్తున్నారు. వారి నుంచి డబ్బు తీసుకొచ్చిన నాయకులు కొంతమంది ఓటర్లకే పంపిణీ చేసి మిగిలిన మొత్తం తమ వద్ద ఉంచుకుంటున్నారు. పైకి మాత్రం అందరికీ పంపిణీ చేసినట్లు అభ్యర్థులకు లెక్కలు చెబుతున్నారు. మరికొందరు ఓటర్లకు ఇవ్వాలని అభ్యర్థులు చెప్పిన మొత్తంలో కొంత కోత వేసి...పంపిణీ చేస్తున్నారు.





ఓటుకు పోదాం.. చలో చలో..

- అది మన హక్కు
- నిజాయితీ గల నేతలను ఎన్నుకుందాం
- వ్యవస్థల మార్పునకు పునాది వేద్దాం
- మన భవిష్యత్తు రాతను మార్చుకుందాం
- లేదంటే ప్రశ్నించే హక్కును కోల్పోతాం

ఎన్నికల సమయం వచ్చేసింది. మన భవిష్యత్తును నిర్ణయించుకునే సమయం ఆసన్నమైంది. రేపు మన పాలకులు... పాలన ఎలా ఉండాలో నిర్ణయం తీసుకోవలసింది ఈ రోజే. ఈ రోజు సమయాన్ని... అవకాశాన్ని వినియోగించుకోకుంటే... రేపు మన కళ్ల ముందు ఏం జరుగుతున్నా... నిస్సహాయంగా నిలుచోవలసి వస్తుంది. అందుకే ఓటుతో మన భవిష్యత్తును లిఖించుకుందాం.

(విజయనగరం)

ఈ ఎన్నికల్లో మీ ఓటు హక్కును వినియోగించుకోండి. ఓటు విలువను గుర్తించండి. సాధారణంగా చాలామంది తమ ఓటు లెక్కలోకి రాదులే అనుకుంటారు. మరికొందరు తాను ఒక్కడినే ఓటు వేయకపోతే ఏమవుతుందిలే అని చెప్పి పోలింగ్ రోజు కుటుంబం, స్నేహితులతో కాలక్షేపం చేస్తుంటారు. మరి కొంతమంది సరైన అభ్యర్థి లేకపోవడంతో ఓటు వేయలేదని చెబుతుంటారు. ఒక నియోజవర్గంలో సరాసరి 54 శాతం మంది మాత్రమే ఓటు వేస్తున్నట్లు గణంకాలు చెబుతున్నాయి. ఇందులో గెలిచే పార్టీకి 16 నుంచి 20 శాతం ఓట్లు మాత్రమే పడుతున్నాయి. ఆ పార్టీ ఆధిక్యత 5 శాతం కంటే తక్కువే ఉంటోంది. దీనివల్ల విజయం సాధించిన అభ్యర్థికి ఓటర్లపై చులకన భావం ఏర్పడుతుంది. ఈ విధానంలో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకుని.. ఓటింగ్ శాతాన్ని పెంచాలి.

స్వీప్‌తో అవగాహన

ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో పనిచేస్తున్న సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) విశేషంగా కృషి చేస్తోంది. ఓటు హక్కు నమోదు నుంచి మార్పు, చేర్పులు, సవరణలు ఇతర సమస్యలపై క్షేత్ర స్థాయిలో వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తోంది. ఎన్నికల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల కోసం ఈసీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

అశ్రద్ధ వద్దు..


ఓటు హక్కు వినియోగంపె అశ్రద్ధ చేయవద్దు. పోలింగ్ బూత్‌కు వెళ్లి ముందు వరుసలో నిల్చుని హక్కును వినియోగించుకోవాలి. పోలింగ్ శాతం గణనీయంగా పెరగడానికి ఉదయం 7 గంటల నుంచే ఓటు వేసేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6 గంటల వరకు ఓటు వేయవచ్చు. అంటే 11 గంటల సమయం ఉంటుంది. అయినా చాలామంది ఓటేసేందుకు ముందుకు రారు. ఎన్ని పనులు ఉన్నా ఓటు వేసేందుకు సమయం కేటాయించాలి. రాజ్యాంగం కల్పించిన హక్కుపై అశ్రద్ధ చేయవద్దు.

కావలసిన గుర్తింపు పత్రాలు

పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఫొటో ఉన్న సర్వీస్ గుర్తింపు కార్డు (కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ప్రభుత్వ రంగ సంస్థ జారీ చేసినవి), ఫొటో ఉన్న బ్యాంకు లేదా తపాలా ఖాతా పాస్‌బుక్‌లు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీ ఐ ఇచ్చిన స్మార్ట్‌కార్డు, ఎంఎన్‌ఆర్‌ఈజీఏ జాబ్‌కార్డు, కార్మిక మంత్రిత్వశాఖ ఇచ్చిన ఆరోగ్య బీమా కార్డు, ఫొటో ఉన్న పింఛను పత్రం, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు జారీ చేసిన గుర్తింపు కార్డు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు

- ర్యాంపు, చక్రాల బండి, చూపులేని ఓటర్ల కోసం వలంటీర్ల సహాయానికి అనుమతి.
- ఓటు వేయడంలో అసామర్థ్యాల వ్యక్తులకు, వయో వృద్ధులకు ప్రాధాన్యం.
- ఈవీఎంలపై బ్రెయిలీ లిపి సదుపాయం.
- పురుషులు, మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు.
- ఒక పురుష ఓటరు, ఇద్దరు మహిళా ఓటర్లకు పోలింగ్ స్టేషన్‌లోకి ప్రవేశం.
- గుర్తించిన ప్రదేశాల్లో మహిళలకు మాత్రమే పోలింగ్ కేంద్రం.
- ఓటర్లకు ఫొటో ఓటరు స్లిప్పులు
- పోలింగ్ కేంద్రంలో తాగునీరు, అత్యవసర చికిత్స సదుపాయం, మరుగుదొడ్లు.
- అసామర్థ్యాలున్న వ్యక్తులకు ఉచిత రవాణా.



వీటిని గుర్తుంచుకోండి..

సెల్‌ఫోన్లు సహా ఏ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించరు.

- వరుసలో నిలబడి మీ గుర్తింపు కార్డును, ఓటర్ చీటీని సిద్ధంగా ఉంచుకోండి.
- ఓటు వేయడానికి ఈవీఎంపై మీట నొక్కండి. అనంతరం బీప్ అనే శబ్దం వినిపిస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి పేరు, గుర్తుకు ఎదురుగా ఎర్రలైటు వెలుగుతుంది
- పైన చూపించిన విధంగా ఎంపిక చేసుకున్న అభ్యర్థి క్రమసంఖ్య, పేరు, గుర్తుకు ఎదురుగా ఉన్న ప్రింటర్ ఒక బ్యాలెట్ స్లిప్‌ను వీవీ ప్యాట్ ముద్రిస్తుంది. యంత్రానికి చెందిన అద్దంలో నుంచి ప్రింట్ చూడండి. ఏడు సెకన్లు ఉంటుంది.

పోలింగ్ ఏజెంట్లే కీలకం

సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్లదే కీలకమైన పాత్ర. పోలింగ్ బూత్‌లో ఉన్న ఏజెంట్లందరూ ఒక్కటైపోతే దొంగ ఓటర్లు సులువుగా ఓటు వేసుకునే అవకాశం ఉంటుంది. అందుకే పార్టీ నాయకులు ఏజెంట్ల ఎంపిక విషయంలో చాలా అప్రమత్తంగా ఉంటారు. పార్టీకి విధేయులుగా ఉన్న వారినే నియమిస్తారు. దొంగ ఓట్లు వేసే వారిని అడ్డుకోవడం.. ఒకవేళ దొంగ ఓటు వేయడానికి ఎవరైనా వస్తే వారిని గుర్తించి పోలింగ్ అధికారులకు తెలియజేయడం వంటివి చేస్తుంటారు. ఓటర్లను పోలింగ్ ఏజెంట్లు గుర్తించిన తరువాతే ఓటు వేసేందుకు పోలింగ్ సిబ్బంది అనుమతిస్తారు. వాస్తవంగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ అభ్యర్థుల తరఫున ఏజెంట్లను నియమించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతిస్తుంది. ఇందుకు ముందుస్తుగా ఫొటో గుర్తింపు కార్డు ఇస్తారు. గతంలో ఎన్నికల అధికారుల ఫొటోలు లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేసేది. ఒకరి తరుపున మరొకరు ఏజెంట్లుగా వ్యవహరించే అవకాశం ఉన్నందున ఎన్నికల అధికారులు గుర్తింపుకార్డులు ఇస్తున్నారు.

ఇవీ నిబంధనలు

- పోలింగ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి ఆ పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటరై ఉండాలి.
- ఓటు వేయడానికివచ్చే వారిని గుర్తించేందుకు మాత్రమే ఏజెంట్లను నియమిస్తారు. అంతేకానీ వారికి ఎలాంటి అధికారాలు ఉండవు.
- ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ప్రచారాలు చేయరాదు.
- ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక అభ్యర్థికి ఇద్దరు చొప్పున ఏజెంట్లను నియమించుకునే వీలుంది.
- ఇద్దరు ఏజెంట్లు ఒకేసారి ఉండేందుకు అనుమతించరు.
- పార్లమెంట్‌కు ఇద్దరు.. అసెంబ్లీకి ఇద్దరు చొప్పున బరిలో ఉన్న అభ్యర్థులు నియమించుకోవచ్చును.
- ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాలను చూడాల్సి ఉంటుంది.



పాలకొండ: పోలింగ్ సామగ్రితో కేంద్రానికి బయలుదేరిన సిబ్బంది



పాలకొండ: ఎన్నికల విధులకు సిద్ధమవుతున్న సిబ్బంది

విధులకు సిద్ధమై..

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. విజయనగరం, నెల్లిమర్ల, చీపురుపల్లి, రాజాం, బొబ్బిలి, గజపతినగరం, ఎస్.కోట, సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ నియోజకవర్గ కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి సామగ్రితో సిబ్బంది ఆదివారం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఆర్టీసీ బస్సుల్లో మెటీరియల్‌ను తరలించారు. రోజంతా ఎక్కడ చూసినా ఎన్నికల అధికారుల హడావిడే కనిపించింది. ఈవీఎంలు, వీవీప్యాట్‌లు, ఫ్లాంక్‌లు, పేపర్లు, ఇతర మెటీరియల్‌ను తమతో పాటు తీసుకెళ్లారు. సిబ్బందిని సామగ్రిని తరలించేందుకు ఆర్టీసీ సర్వీసులతో పాటు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాలను కూడా వినియోగించారు.

- ఆంధ్రజ్యోతి బృందం



పార్వతీపురం టౌన్: ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా అధికారులు, సిబ్బంది



విజయనగరంలో పోలింగ్ సామగ్రితో బస్సు ఎక్కుతున్న సిబ్బంది



బొబ్బిలిలో ఏర్పాట్లు..



విజయనగరం: పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆటోలు



బస్సులో పోలింగ్ సిబ్బంది



ఎన్నికల విధుల్లో దివ్యాంగుడు



సాలూరు: ఎన్నికల సామగ్రితో సిబ్బంది



ఎస్‌కోట: సామగ్రి పంపిణీలో పోలింగ్ అధికారులు, సిబ్బంది



రాజాంలో ఏర్పాట్లు..



నెల్లిమర్ల: పోలింగ్ విధులకు హాజరుకానున్న పోలీసులు

పోలింగ్‌కు అంతా సిద్ధం

● నేడు సార్వత్రిక ఎన్నికలు ● ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహణ

● కేంద్రాలకు చేరుకున్న సామగ్రి ● భద్రతా ఏర్పాట్లు చేస్తున్న పోలీసు అధికారులు


పాలకొండ: ఎన్నికల విధులకు సిద్ధమవుతున్న సిబ్బంది


కురుపాం: పంపిణీ కేంద్రంలో బిజీగా ఉన్న ఎన్నికల అధికారులు, సిబ్బంది


పాలకొండ: అధికారులను ఆరా తీస్తున్న ఆర్వో శుభంబన్సల్


సాలూరు: అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్వో విష్ణుచరణ్


పార్వతీపురం: కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

పాలకొండ: జిల్లాలో సోమవారం నిర్వహిస్తున్న సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధమయ్యింది. పాలకొండ నియోజకవర్గానికి సంబంధించి పోలింగ్ సామగ్రిని ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆర్వో శుభం బన్సల్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సిబ్బంది ప్రత్యేక వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 287 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 287 మంది పీవోలు, 287 మంది ఏపీవోలు, 1148 మంది ఓపీవోలు ఉన్నారు. నియోజకవర్గంలో 35 సెక్టార్లలో 35 మంది సెక్టోరియల్ ఆఫీసర్లను నియమించారు. 35 రూట్‌లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో లక్షా 95 వేల 20 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 94,969, మహిళలు లక్షా 36 మంది, ఇతరులు 15 మంది ఉన్నారు.

పటిష్ఠ బందోబస్తు

పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎన్నికల బందోబస్తు పరిశీలకుడు పరిషత్‌చంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు ఏర్పాటు చేశారు. బందోబస్తు కోసం ఆరుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, వంద మంది కేంద్ర బలగాలు, 50 మంది ఆక్టోపస్ సిబ్బంది, స్ట్రయికింగ్ ఫోర్స్ 15 మంది బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే 142 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు.

ప్రశాంత ఓటింగ్‌కు సహకరించాలి

నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అంతా సహకరించాలని ఆర్వో శుభం బన్సల్ తెలిపారు. ఉదయం 5.30 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ నిర్వహిస్తారని, ఆ సమయానికి ఏజెంట్లు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. పోలింగ్ శాతం తక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తమ సిబ్బంది ద్వారా పోలింగ్ మరింత శాతం పెరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

కురుపాం: నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేశామని ఆర్వో వీవీ రమణ తెలిపారు. కురుపాంలో ఏర్పాటుచేసిన ఎన్నికల పంపిణీ కేంద్రం ద్వారా 16 స్పెషల్ కౌంటర్లు, 16 జనరల్ కౌంటర్ల ద్వారా ఆదివారం ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 44 సెక్టార్ల ద్వారా 268 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు, సామగ్రి అందజేశామని చెప్పారు. ఈ ఎన్నికల్లో సుమారు రెండు వేల మంది సిబ్బందిని ఉపయోగిస్తున్నామన్నారు. ఈసందర్భంగా పాలకొండ డీఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరగడానికి అని ఏర్పాట్లు చేశామని చెప్పారు. సంబంధిత రూట్లు ఏ పోలీసు అధికారులు సూపర్‌వైజ్ చేయాలో నియమించమన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రతేక ఏర్పాట్లు చేశామని తెలిపారు. ● నియోజకవర్గంలో మొత్తం 1,94,114 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుష ఓటర్లు 94,337మంది, మహిళా ఓటర్లు 99,736 మంది, థర్డ్‌జెండర్లు 42 మంది ఉన్నారు. ● కురుపాం మండలంలో 35,215 మంది ఓటర్లు, గుమ్మలక్ష్మీపురం మండలంలో 34,965 మంది ఓటర్లు, జియ్యమ్మవలస మండలంలో44,134 మంది ఓటర్లు, కొమరాడ మండలంలో 41,088 మంది ఓటర్లు, గరుగుబిల్లి మండలంలో 38,712 మంది ఓటర్లు ఉన్నారు.

పార్వతీపురం నియోజకవర్గంలో 233 పోలింగ్ కేంద్రాలు

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధమయ్యింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఆర్వో హేమలత ఆధ్వర్యంలో చేపట్టారు. సిబ్బంది సామగ్రితో సహా ప్రత్యేక వాహనాల్లో కేంద్రాలకు తరలివెళ్లారు. పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో 233 పోలింగ్ కేంద్రాలున్నాయి. 233మంది పీవోలు, 233మంది ఏపీవోలు, 1072 మంది ఓపీవోలు ఉన్నారు. నియోజకవర్గంలో 37 రూటుల్లో, 33 మంది సెక్టార్లల్లో 1398 పోలింగ్ సిబ్బంది పని చేయనున్నట్లు చెప్పారు. ● నియోజకవర్గంలో లక్షా 89వేల 817 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 95 వేల 514 మంది కాగా, మహిళలు 96వేల 292 మంది, ఇతరులు 11 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లు లక్షా 89 వేల 817 మంది ఉన్నారని చెప్పారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేసినట్టు ఆర్వో తెలిపారు.

సాలూరులో 2.04 లక్షల మంది ఓటర్లు

సాలూరు/ రూరల్: సాలూరు నియోజకవర్గానికి సంబంధించి సోమవారం జరగనున్న పోలింగ్‌కు ఆర్వో సి.విష్ణుచరణ్ ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,04,488 ఓటర్లు ఉండగా, వారిలో పురుష ఓటర్లు 99,770మంది, మహిళా ఓటర్లు 1,04,714మంది. ఇతరులు నలుగురు ఉన్నారు. ● సాలూరు నియోజకవర్గంలో ఎన్నికల భద్రత ఏర్పాట్లను ఏఎస్పీ అక్టోపస్ నరేష్‌బాబు పర్యవేక్షణలో చేస్తున్నారు. డీఎస్పీ మురళీధర్, సాలూరు అర్బన్, రూరల్ సీఐలు వాసునాయుడు, బాలకృష్ణతో సహా ఏడుగురు సీఐలు, పది మంది ఎస్‌ఐలు, 12 సెక్షన్లు సీఆర్‌పీఎఫ్, 11 క్యూఆర్టీ టీఎంలు పాల్గొను న్నాయి. సాలూరు నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలోగల 143 ప్రాంతాల్లో ఉన్న 193 పోలింగ్ కేంద్రాల్లో 350 మంది పోలీసు సిబ్బంది భద్రతా విధులు నిర్వహించనున్నారు. పది పోలింగ్ కేంద్రాలను మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా, 14 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఎన్నికల సిబ్బంది తరలించడానికి ప్రైవేట్ వాహనాలతో పాటు 40 ఆర్టీసీ బస్సులను వినియోగించారు.

ఉదయం 5.30కు మాక్ పోలింగ్

సాలూరు ఆర్వో సి.విష్ణుచరణ్ విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 243 పోలింగ్ కేంద్రాల ద్వారా పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ పోలింగ్ ప్రక్రియలో సుమారు 1,500 మంది సిబ్బంది పాల్గొంటారని ఆయన తెలిపారు. 35 రూట్ల ద్వారా సెక్టరల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తారన్నారు. 148 పోలింగ్ కేంద్రాలో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ నిర్వహిస్తారని చెప్పారు. 73 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

భామిని: మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్దకు ఆదివారం మధ్యాహ్నామే సిబ్బంది చేరుకున్నారు. మండలంలో 44 పోలింగ్ కేంద్రాలు ఉండగా అన్ని చోట్లకు బస్సు ద్వారా సిబ్బంది చేరారు. మణిగ, తివ్వకొండపై ఉన్న పోలింగ్ కేంద్రానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో భామిని నుంచి బొలెరో వాహనం ద్వారా అక్కడికి చేరుకున్నారు. ఎన్నికల సిబ్బందికి నెట్‌వర్క్ సౌకర్యం లేదు. భామిని మండలంలో 44 పోలింగ్ కేంద్రాల్లో 43 మాత్రమే అనుకూలమైన కేంద్రాలు ఉన్నాయి. ఒక్క కేంద్రం మాత్రమే నెట్ సౌకర్యం లేని కేంద్రంగా నిలిచింది. ● **మక్కువ:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సంబంధిత పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. మండలంలో 53 పోలింగ్ బూత్‌లు ఉండగా, మొత్తం 42,257 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎస్‌ఐ పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు చేపట్టారు. ఇప్పటికే ఓటరు స్లిప్పులు బీఎల్వోలు పంపిణీ చేశారు. పోలింగ్ సిబ్బంది ఇబ్బంది పడకుండా సెక్టోరియల్ అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించారు. ● **గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని 56 పోలింగ్ కేంద్రాలకు కురుపాం కేంద్రం నుంచి ఎన్నికల సిబ్బంది తరలి వెళ్తున్నారు. మండలంలోని నాలుగు రూట్లకు నాలుగు బస్సులను ఎన్నికల సిబ్బంది కోసం కేటాయించారు. మారుమూల కొండలపై ఉన్న చాపరాయి, జంగిడిభద్ర, గొయ్యిపాక, జర్న తదితర పోలింగ్ కేంద్రాలకు కూడా సిబ్బంది వెళ్లారు. రేపు ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభమయ్యేలే తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరే సమయంలో పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించానికి తగిన చర్యలు తీసుకున్నామని ఎల్‌ఎన్‌పేట పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. ● **కొమరాడ:** సార్వత్రిక ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా ఎన్నికల సిబ్బంది తమ సామగ్రితో ఆదివారం సాయంత్రం మండలంలోని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ● **వీరఘట్టం:** మండలానికి సంబంధించి ఎన్నికల సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం నుంచే ఆయా పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చేశారు. ● **గరుగుబిల్లి:** సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. మండలానికి 49 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం జరగనున్న ఎన్నికల్లో 25 పంచాయతీలకుగాను 19,455 మంది పురుషులు, 19,257 మంది స్త్రీలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.


భామిని: బురుజోల పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది


మక్కువలో..


గుమ్మలక్ష్మీపురంలో..


కొమరాడ: పెదఖేర్జిల పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

రహదారి కుంగినా పట్టించుకోరా?

● విజయరాంపురం-అనసభద్ర మార్గంలో ఊటగెడ్డ సీసీ రోడ్డుపై ప్రమాదకరంగా గుంత

● నిత్యం గిరిజనుల రాకపోకలు ● పొంచి ఉన్న ప్రమాదం

● చర్యలు తీసుకోని అధికారులు

మక్కువ: నిత్యం రాకపోకలు సాగించే ఆ దారిలో పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఆ దారిలో ఆదమరిచి ప్రయాణం చేస్తే అంతే సంగతి. ప్రమాదం కొనితెచ్చుకోవాల్సిందే. మక్కువ మండలంలో విజయరాంపురం నుంచి అనసభద్ర గ్రామానికి వెళ్లే మార్గంలో ఊటగెడ్డ వద్ద ఉన్న సీసీ రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. ఈ దారిలోనే గిరిజనులు నిత్యం వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్తుంటారు. ఈ గుంత ఏర్పడి చాలా నెలలు గడుస్తున్నా ఎవరూ పూడ్చే పరిస్థితే లేదు. ఈ గుంతను ఇలాగే వదిలేస్తే ప్రమాదాలు సంభవించే ఆస్కారం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ గుంతను పూడ్చాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.


ఊటగెడ్డ సీసీ రహదారిపై ఏర్పడిన భారీ గుంత

అప్రమత్తంగా ఉండాలి

మక్కువ: మండలంలోని పనసభద్ర పంచాయతీ పరిధి దిగువ మెండంగి, ఆలగురువు పోలింగ్ కేంద్రాలను ఎస్‌ఐ పి.నరసింహమూర్తి ఆదివారం పరిశీలించారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల జాబితాలో ఉండడంతో సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. ఓటర్ల పట్ల మర్యాద పూర్వకంగా మెలగాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇలా అయితే నడిచేదెలా?

● రోడ్డుపై ప్రవహిస్తున్న పంట కాలువ నీరు

● ఇబ్బందులకు గురవుతున్న చిదిమి గ్రామస్థులు

● పట్టించుకోని అధికారులు


రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తున్న దృశ్యం

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామంలో ప్రధాన రహదారిపై నుంచే నీరు ప్రవహిస్తోంది. దీంతో రహదారిపై రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పంట కాలువల్లో పూడికలు తీయకపోవడం కారణంగా సాగునీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలను బాగు చేసి, రోడ్డుపై నుంచి నీరు ప్రవహించకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రానికి వెళ్లే దారిదే!

● సీతారాంపురంలో అధ్వానంగా పారిశుధ్యం

గరుగుబిల్లి: మండలానికి సంబంధించి కొన్ని పోలింగ్ కేంద్రాల్లో అసౌకర్యాలు దర్శనమిస్తున్నాయి. కొంకడివరం పంచాయతీ సీతారాంపురం పోలింగ్ కేంద్రానికి ఓటర్లు ఓటు వేసేందుకు వెళ్లాలంటే మురుగును దాటాల్సిందే. ఈ గ్రామంలో గత కొన్ని రోజులుగా పారిశుధ్య పరిస్థితి అధ్వానంగా ఉంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు ఇలా రోడ్డుమీదే ప్రవహిస్తోంది. కాలువల్లో పూడికలు పేరుకుపోయాయి. పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ఇటువంటి అధ్వాన పరిస్థితులు తలెత్తాయి.


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

చిన్నశిర్లాంలో దారుణ హత్య

● నిద్రిస్తున్న సమయంలో గొంతుకోసి పరారైన దుండగులు

● మృతుడు టీడీపీ సానుభూతిపరుడు


ఘటనా స్థలంలో చీపురుపల్లి ట్రైనీ డీఎస్పీ, పోలీసు సిబ్బంది


సంగాం (ఫైల్)

రేగిడి, మే 12: విజయనగరం జిల్లా రేగిడి మండలం చిన్నశిర్లాంలో శనివారం అర్ధరాత్రి దాటాక దళిత వర్గానికి చెందిన ఉత్తరావల్లి సంగాం(65)ను దారుణంగా హత్య చేశారు. ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో భార్య పక్కన ఉంటుండగానే గుర్తు తెలియని వ్యక్తులు అకస్మాత్తుగా కత్తితో గొంతుకోసి ఈ దారుణానికి ఒడిగట్టారు. సంగాం టీడీపీ సానుభూతిపరుడు. దీంతో ఈ హత్య రాజకీయకోణంలో జరిగిందా లేక వ్యక్తిగతమా అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది. ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరావల్లి సంగాం రాజాం కోర్టులో ఉద్యోగిగా పనిచేస్తూ ఐదేళ్ల క్రితం పదవీ విరమణ పొందారు. రోజూలానే శనివారం రాత్రి ఇంటి ఆరుబయట మంచంపై నిద్రకు ఉపక్రమించారు. భార్య నక్షిత్రమ్మ కూడా పక్కనే ఉన్నారు. అర్ధరాత్రి 1.20 గంటలకు గుర్తు తెలియని వ్యక్తులు కరంట్ లేని సమయంలో వచ్చి సంగాంపై దాడి చేశారు. పదునైన కత్తితో పీకపై గాయపరచడంతో తీవ్ర రక్తస్రావమై భర్త ఒక్కసారిగా కేకలు వేశాడు. గమనించిన భార్య ఒక్కసారికి హతాశురాలైంది. బైక్‌పై వచ్చిన దుండగలు గొంతుకోసి క్షణాల్లో పరారయ్యారు. కొన ఊపిరితో ఉన్న ఈయన్ను రాజాం కేర్ అసుపత్రికి తరలించగా మార్గమధ్యలో తనువు చాలించినట్లు కుటుంబీకులు తెలిపారు. సంగాంకు ఇద్దరు పిల్లలు కాగా పెద్ద కుమారుడు కిశోర్ కేబుల్‌లో పనిచేస్తుండగా, చిన్న కుమారుడు కిరణ్ ఇంటివద్ద ఉంటాడు. సంగాంకు మాజీ జడ్‌పీటీసీ, టీడీపీ నేత మంతిన ఉషారాణి వరుసకు మేనకోడలు. టీడీపీకి సానుభూతిపరుడిగా ఉన్నారు. వివాద రహితుడన్న పేరుంది. ఇలాంటి వ్యక్తి ఎన్నికల ముందురోజు హత్యకు గురికావడం గ్రామంలో సంచలనమైంది. ఈఘటన పోలీసులకు సవాల్‌గా మారింది.

భిన్న కోణాల్లో విచారణ

చీపురుపల్లి డీఎస్పీ శ్రీనివాస్ చక్రవర్తి, ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, రాజాం రూరల్ సిఐ శ్రీనివాసరావు, రేగిడి ఎస్‌ఐ శ్రీనివాస్ ఆదివారం ఉదయం చిన్నశిర్లాంలో సంఘటనా స్థలానికి చేరుకొని భిన్నకోణాల్లో విచారించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌లు రప్పించి హత్యప్రదేశంలో ఉన్న సాక్ష్యాలను సేకరించారు. మృతదేహానికి రాజాం ఏరియా అసుపత్రిలో శవపంచనామా, పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు మృతదేహాన్ని అప్పజెప్పారు.

దోషులను తక్షణమే పట్టుకోవాలి

మామయ్య వివాద రహితుడిగా పేరుంది. మా గ్రామంలో ఇలాంటి హత్యలు ఎప్పుడూ లేవు. ఎన్నికల వేళ ఈఘటన జరగడం అత్యంత దారుణం. నిందితులను తక్షణమే పట్టుకొని శిక్షించాలి.

- ఉషారాణి, మాజీ జడ్పీటీసీ

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

రామభద్రపురం: మండల పరిధిలోని ఆరికతోట జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్‌ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముచ్చర్లవలస గ్రామానికి చెందిన బొడ్డు జగన్మోహన్‌రావు(40) విజయనగరం నుంచి బూసాయవలస వైపు బైక్‌పై వస్తుండగా అదే దారిలో వస్తున్న వ్యాను వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో తలకు తీవ్రంగా గాయమవడంతో జగన్మోహన్‌రావు అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని బాడంగి సామాజిక ఆసుపత్రికి తరలించామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైతుల్లో ఆందోళన


అమ్మకానికి సిద్ధం చేస్తున్న తడి ధాన్యం

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాల రైతుల్లో ఆందోళన నెలకొంది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు వస్తుండటంతో రైతుల్లో దిగులు మొదలైంది. రబీ వరితో పాటు నువ్వు పంట చేతికొచ్చే సమయంలో వాతావరణంలో మార్పులు రావడంతో పంటను కోత కోయలేని స్థితిలో ఉన్నారు. గత రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి కొంతమేర నష్టం వాటిల్లింది. వర్ష సూచనతో పలు గ్రామాల్లోని రైతులు నూర్పు యంత్రాలతో నూర్పులు చేసి తడి ధాన్యాన్ని అమ్మకానికి సిద్ధమవుతున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో తక్కువ ధరకే అమ్మకం చేస్తున్న పరిస్థితి నెలకొంది. నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న సమాచారంతో పండిన పంట పాడయ్యే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

సూర్యదేవునికి పూజలు

జామి: మండల కేంద్రమైన జామిలో వైశాఖ ఆదివారం పురస్కరించుకుని మండల కేంద్రమైన జామిలో కలియుగ ప్రత్యక్షదైవం సూర్యదేవునికి పూజలు చేశారు. ఇందులో భాగంగా తమ ఇళ్లముందు సూర్య నమస్కారాలు చేసి స్వామి వారికి అరటిపళ్లు, మొక్కపెసలు వంటివి విసిరి మొక్కులు చెల్లించుకున్నారు. ఇవి పురాతనంగా వస్తున్న సంప్రదాయమని ఇలా చేస్తే స్వామి కరుణ ఉంటుందని, సంపూర్ణమైన ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు.


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

బాబా ఆలయంలో సుదర్శన హోమాలు

గరుగుబిల్లి: స్థానిక శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం సుదర్శన హోమాలను ఘనంగా నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం

గరివిడి: గరివిడి ఓంశాంతి సెంటర్‌లో సెంటర్ ఇన్‌చార్జి లతక్క ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాతృమూర్తులకు ఆటల పోటీలు, పాటల పోటీలు, కుర్చీల ఆట, పలు ఆటలు ఆడించి విజేతలకు బహుమతులు అందించారు. మాతృమూర్తులు ఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు.


మాతృమూర్తులకు కుర్చీలాట నిర్వహిస్తున్న దృశ్యం

రంగనాథంకు సాహిత్య పురస్కారం

రాజాం: రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు, రచయిత గార రంగనాథం సాహిత్య పురస్కారం అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక విశిష్టాద్వైత జాతీయ సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు భాష సంరక్షణ కోసం ప్రతి తెలుగువాడు పాటుపడాలని వెంకయ్యనాయుడు అన్నారు. వరంగల్‌కు చెందిన శ్రీలేఖ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాయరత్న మంజూష గ్రంథ రచయిత గార రంగనాథంతో పాటు మరో ఇద్దరికి వెంకయ్యనాయుడు పురస్కారాలను అందజేశారు. రేవూరి అనంత పద్మనాభ రామారావు అధ్యక్షత వహించగా తిరునగిరి రంగస్వామి, గార సీతారత్నం, సమ్మెట నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.